క్లుప్తంగా

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : హైదరాబాద్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించబోయే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు కోరారు. గురువారం చిలుకూరులో మహాసభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, మధు, నాయకులు అనీల్, పవన్, శ్రీకాంత్, జిలానీ పాషా, వినోద్ కుమార్, రఫీ, వెంకటేష్ పాల్గొన్నారు.

కల్మేట్‌తండాలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని కల్మేట్‌తండాలో గిరిజన శక్తి సంఘం ఆధ్వర్యంలో గురువారం అపోలో రీచ్ హాస్పిటల్ మిర్యాలగూడెం వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ భూక్యా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సుమారు రెండు వందల మంది పేదలకు బీపీ, షుగర్, గుండె, ఎముకలు, జీర్ణక్రియ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ గోరి, ఎంపీటీసీ విజయ వెంకటి, గిరిజన శక్తి సంఘం రాష్ట్ర కార్యదర్శి కెతావత్ మధునాయక్, డాక్టర్ ఝాన్సీలక్ష్మీభాయి, మార్కెటింగ్ సభ్యులు బాబునాయక్, పాండు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని యాతవాకిళ్లలో ప్రతిష్ఠించిన శ్రీకనకదుర్గమ్మ వద్ద గురువారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, వంటిపులి శ్రీనివాస్, కుక్కల నాగరాజు, బండి వెంకటరెడ్డి, గడ్డం వీరయ్య, జక్కుల గురువయ్య, కాసాని వెంకటాచారి, బాలనాగయ్య, సైదులు, శ్రీను, వెంకటేశ్వర్లు, సతీష్, అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన ఎస్కే మస్తాన్(37) వారం క్రితం పట్టణంలోని వినాయకుడి గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు గురువారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువతి అదృశ్యం



ఇందు (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. వేపలసింగారం గ్రామానికి చెందిన సోమవరపు ఇందు ఈ నెల 23న సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఇందు తండ్రి సోమవరపు వెంకటాచారి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పది లక్షల ఉద్యోగాల కల్పనే బీఎస్పీ లక్ష్యం

పాలకవీడు : బీఎస్పీ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో పదిలక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శూన్యపహాడ్ తదితర గ్రామాల్లో పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు రామస్వామి, గణేష్‌నాయక్, నాగార్జున, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

గరిడేపల్లి : పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50వేల చొప్పున నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్కే యాకూబ్ అన్నారు. మండల కేంద్రం పరిధిలో ఎండిపోయిన వరి పొలాలను గురువారం పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు హుస్సేన్, కృష్ణారెడ్డి, నర్సయ్య, సీతారాములు, శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంజలీపురంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వీరయ్య, సీతయ్య, ముసలి, వెంకన్న, హుస్సేన్, పుల్లమ్మ, చందర్‌రావు, మల్లయ్య, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మేళ్లచెరువు : బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యే సైదిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడపగడపకు వెళ్లి గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. రైతుబంధు ఇవ్వకుండా రాకుండా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశాడని, ప్రజలకు మంచి జరిగితే ఉత్తమ్ సహించలేడని, రేపు ఆయన గెలిచినా తన ఏజెంట్లను, గుమస్తాలను గ్రామాల్లోకి పంపి రాజకీయాలు చేస్తాడని ఎద్దేవా చేశారు. అంతకు ముందు వివిధ గ్రామాలకు చెందిన పలువురికి పార్టీ కండువాలు బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, సూరిశెట్టి భసవయ్య, జేవీఆర్, బ్రహ్మారెడ్డి, రామలింగారెడ్డి, ఇమ్రాన్, జనిగ సైదులు యాదవ్, వెంకటరెడ్డి, ఓయూ జేఏసీ నాయకుడు జక్కుల వెంకటేష్ యాదవ్, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదాడలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- కాంగ్రెస్ కోదాడ అభ్యర్థి పద్మావతి

కోదాడ : కోదాడలో కాంగ్రెస్ గెలుపు ఎప్పుడో ఖాయమైందని, 50 వేల మెజార్టీ సాధించి కాంగ్రెస్ సత్తా ఏంటో చూపాలని కాంగ్రెస్ పార్టీ కోదాడ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి కోరారు. గురువారం కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అమరగాని కృష్ణ, కేఎల్‌ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో గడిచిన ఐదు సంవత్సరాలలో ఏం అభివృద్ధి జరిగిందో ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవ్వరికి భయపడకుండా నిర్భయంగా కాంగ్రెస్‌లోకి రావాలని, అందరం కలిసి అరాచక పాలనకు తెరదించుదామన్నారు. వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధం

కోదాడరూరల్ : బీఆర్‌ఎస్ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్లకుంట, తొగర్రాయి, కూచిపూడి, కాపుగల్లు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా రెడ్లకుంట నుంచి 20 బీఆర్‌ఎస్ కుటుంబాలను, తొగర్రాయి, కూచిపూడి నుంచి పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మల్లెల ప్రసాద్, గంగవరపు లక్ష్మణ్‌రావు, కనగాల నాగేశ్వరరావు, కునుగుంట్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుందర్‌రావు, నాయకులు ఉన్నారు.



కోదాడ : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

మునగాల : కోదాడలో కాంగ్రెస్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి కోరారు. వెంకట్రాంపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ జిల్లేపల్లి వీరబాబు, జిల్లేపల్లి నరేష్‌లు గురువారం కోదాడ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య ఆధ్వర్యంలో పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వీరబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

అనంతగిరి : మండలంలోని చనుపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో సుమారు 12 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి గురవయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తాళాలు వేసిన ఇళ్లలో చోరీ

- రూ.25వేల నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

మోతె: మండల పరిధిలో కరక్కాయలగూడెం గ్రామంలో బుధవారం తాళాలు వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన జంపాల సత్యం, అంగన్‌వాడీ టీచర్ పద్మ తమ ఇళ్లకు తాళాలు వేసి వారి వారి పనులకు వెళ్లడాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి సత్యం ఇంట్లో రూ.5వేల నగదు, బంగారు చెవి దిద్దులు దొంగిలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్ పద్మ ఇంట్లో బీరువాలో దాచుకున్న రూ.20వేల నగదు, పది తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. పాడి రైతు మృతి

కోదాడరూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో పాడి రైతు మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని అనంతగిరి రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం శ్రీరంగాపురానికి చెందిన గుడిపూడి రవికుమార్(40) కోదాడ పట్టణంలోని నయానగర్‌లో ఉంటు గ్రామంలో వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే రవికుమార్ ఎలక్ట్రికల్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్లి పాలు తీసుకొని కోదాడ పట్టణంలని అనంతగిరి రోడ్డులో కొందరికి పాలు పోసి వస్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో కోదాడ నుంచి అనంతగిరి వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

గరిడేపల్లి : మండలంలోని అబ్బిరెడ్డిగూడెం స్టేజీ వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో ఒక కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రమాదం జరిగిన విషయం తెలియగానే కారు ఆపి గాయపడిన వారిని వెంటనే తన కారులో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్లను మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



ప్రమాద స్థలంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

హుజూర్‌నగర్: ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి 80 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన ఆత్కూరి సుబ్బారావు గరిడేపల్లికి స్కూటీపై బెల్లం తరలిస్తుండగా వాహన తనఖీల్లో పట్టుబడ్డాడు. అతడి వద్ద 80 కేజీల బెల్లం, స్కూటీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ప్రతిరోజూ దాడులు..

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఇక నుంచి ప్రతిరోజూ బెల్టు షాపులపై దాడులు చేస్తామని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 204 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 21 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సారా తయారు చేస్తున్న వారిపై 52 కేసులు నమోదు చేయడమే కాకుండా 2 ఆటోలు, 12 బైక్‌లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. 389 లీటర్ల సారా సీజ్ చేసి, 16,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా 1,098 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 36 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

బెల్టు షాపుపై దాడి.. 16 క్వాటర్లు స్వాధీనం

హుజూర్‌నగర్: బెల్టు షాప్‌పై పోలీసులు దాడి చేసి 16 క్వాటర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎస్‌ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్‌లో రమణయ్య బెల్టు షాపు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి రూ.3వేల విలువైన 16 క్వాటర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

360 కేజీల బెల్లం, 50 కేజీల పటిక పట్టివేత

మోతె: మండల పరిధిలోని మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద గురువారం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మోతె మండల కేంద్రానికి చెందిన శ్రీరంగం సత్యనారాయణ కొత్తగూడెం నుంచి తన సొంత వాహనంలో తరలిస్తున్న 360 కేజీల బెల్లం, 50 కేజీల పటిక తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

‘కోదాడను గంజాయికి అడ్డాగా మార్చారు’

కోదాడ : ప్రశాంతగా ఉన్న కోదాడను అధికార బీఆర్‌ఎస్ నేతలు తమ స్వలాభం కోసం గంజాయికి అడ్డాగా మార్చారని కోదాడ బీఎస్పీ అభ్యర్థి పిల్లుట్ల శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం కోదాడలోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కార్డుతో ఎమ్మెల్యేగా గెలిచిన బొల్లం మల్లయ్యయాదవ్ బీసీలను తీవ్రంగా వేధించాడని ఆరోపించారు. కోదాడలో మట్టి మాఫియా నడిపి పట్టణ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన ఎమ్మెల్యేకు పట్టణ ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఇతర నాయకులను ఎదగనీయలేదని ఆరోపించారు. బహుజనులంతా ఏకమై బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, భీమయ్య, రవి, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, యరసాని కృష్ణ, వీరస్వామి, నెమ్మాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లుట్ల శ్రీనివాస్

‘పది’ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మఠంపల్లి : మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2022- 23 విద్యా సంవత్సంలో అత్యధిక మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థులు 27 మందికి సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో రూ.4 లక్షల 5వేలు నగదు, ప్రశంసా పత్రాలను గురువారం పరిశ్రమ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీనియర్ వీపీ రమణామూర్తి మాట్లాడుతూ పరిశ్రమ వ్యవస్థాపకుడు సమ్మిడి విరారెడ్డి జయంతి సందర్భంగా పదవ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.20వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు హరిదాసు, సుబ్రహ్మణ్యం, తూడి వెంకటరెడ్డి, హెచ్‌ఎంలు తదితరులు ఉన్నారు.



సాగర్ సిమెంట్స్ పరిశ్రమ అందించిన నగదు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మాదిగల విశ్వరూప సభను జయప్రదం చేయాలి

మునగాల : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగ నాయకత్వంలో వచ్చే నెల 18న నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప బహిరంగ సభలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి డా.కత్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని విజయరాఘవపురంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మునగాల మండల అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను మాదిగ, ఉద్యోగుల సమాఖ్య మండల శాఖ అధ్యక్షుడు పచ్చిగోళ్ల శ్రీకాంత్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు శోభన్‌బాబు, రెమిడాల లింగయ్య, రెమిడాల బన్ను, గ్రామపెద్దలు కత్తి బుచ్చిరాములు, కత్తి శ్రీను, కత్తి లింగమ్మ, సొంపంగు లచ్చయ్య, కొత్తపల్లి ఉప్పలయ్య పాల్గొన్నారు.

ప్రజలకు గ్యారంటీ పథకాలను వివరించాలి

మునగాల : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నలమాద పద్మావతి గెలుపు కోసం కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కీత రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కార్యకర్తలు ప్రతి ఒక్కరికి వివరించాలని కోరారు. పార్టీ మండల నాయకులు మైలార్‌శెట్టి సరేష్, చెవుల ప్రభాకర్, జెట్టి నాగేశ్వరరావు, సురేందర్, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించుకుందాం

కోదాడరూరల్ : ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాసాని వెంకటేశ్వర్లు, శంకరశెట్టి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నారాయణరావు, వేలాద్రి, ఉద్దండు, లక్ష్మీనారాయణ, అప్పారావు, కిరణ్, బాబురావు తదితరులు ఉన్నారు.

ఏకలవ్య కమిటీ ఎన్నిక

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఎరుకుల కులస్తులు గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి ఎరుకల ఏకలవ్య సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ద్వారా తమ కులదేవత అయిన నాంచారమ్మ ఆలయం, ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠ కోసం ఐక్యంగా కృషిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాల రవి, కళ్లె రవి, కుంభం మత్తయ్య, కె.వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, ఎం.నాగరాజు, పిచ్చయ్య, ఎం.పిచ్చయ్య, రాంబాబు, బుచ్చయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్

- బీఆర్‌ఎస్ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్‌గా వ్యవహరిస్తుందని, కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేట మునగడం ఖాయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ జోస్యం చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని ఓ మిల్లు ఆవరణలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడలో ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే తోడు దొంగలుగా మారి తనను ఓడించేందుకు కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఎంతమంది ఏకమైనా నియోజకవర్గ ప్రజలు తిరిగి రెండవసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించడం తథ్యమన్నారు. గతంలో ఉత్తమ్ మునగాల మండలంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు సారాయి, లాడ్జీల వ్యాపారం చేసి కోట్ల రూపాయలు పోగు చేసుకొని నేడు సిగ్గులేకుండా కాంగ్రెస్ పార్టీలో చేరి డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. కోదాడ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేవలం ఎన్నికల కోసం రైతుబంధును ఆపాలంటూ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాగూర్ ద్వారా ఎన్నికల సంఘానికి లేఖ రాసి తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుందని ఎద్దేవా చేశారు. అనంతరం గణపవరం క్రాస్‌రోడ్డులో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, మండల నాయకులు చింతకాయల ఉపేందర్, గోపిరెడ్డి నాగిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మునగాల : కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



కోదాడరూరల్ : తొగర్రాయిలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడరూరల్ : రైతు బంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంతోనే రైతులపై ఆ పార్టీకి ఉన్న ప్రేమ అర్థమవుతుందని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. రైతు బంధును నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ కోరడాన్ని నిరసిస్తూ గురువారం మండల పరిధిలోని తొగర్రాయిలో ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, సమన్వయ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, నారాయణరావు, సర్పంచ్‌లు దొంగల లక్ష్మీనారాయణ, శ్రీవిజయకిరణ్, మస్తాన్, నాయకులు వేలాద్రి, ఉద్దండు, నాయకులు, ఉన్నారు.

నడిగూడెం : రైతుబంధు, దళితబంధు పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై నిరసనగా గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నడిగూడెంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరు : రైతుబంధు పథకం అమలును నిలిపివేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తూ గురువారం చిలుకూరులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొండా సైదయ్య, పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, బెల్లంకొండ నాగయ్య, మలుగురు నాగరాజు, కొడారు రాంబాబు, షేక్ పాషా, అల్లి ఉపేందర్, కట్టెకోల వెంకన్న, బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోతె : సంక్షేమ పథకాలు అమలును నిలిపివేయాలని కాంగ్రెస్ కోరడాన్ని ఖండిస్తూ గురువారం హుస్సేన్‌బాద్, రాఘవాపురం గ్రామాల్లో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల దిష్టిబొమ్మలను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దహనం చేశారు. నాయకులు ఆరె లింగారెడ్డి, మద్ది మధుసుదన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, నూకల శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

జీపీఎస్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

హుజూర్‌నగర్ : జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ద్వారా నోడల్ టీములపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రతి చిన్న విషయాన్ని ఎన్నికల కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు తెలిపారు. హుజూర్‌నగర్‌లోని స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్‌లో గురువారం నియోజకవర్గ ఎఫ్‌ఎస్టీ, సీఎస్టీ, వీఎస్టీ, ఎమ్‌సీసీ టీములు, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. చెక్ పోస్టులు, జిల్లా సరిహద్దుల వద్ద నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదులపై అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 113 కేసుల్లో రూ 3.43 కోట్లు సీజ్ చేయగా ఇందులో సరైన ఆధారాలు చూపి జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా 77 కేసుల్లో రూ 1.74 కోట్లు తిరిగి అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ ద్వారా నాటుసారాకు సంబంధించి 205 కేసులు నమోదుచేసి 95 మందిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. రూ 1,80,99,252లు విలువ గల 30,909 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 20 వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎంసీసీ నోడల్ ఆఫీసర్ సతీష్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, హుజూర్‌నగర్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్‌డీఓ జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు

సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో అందించే అల్పాహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సైదానాయక్ కోరారు. గురువారం మండలంలోని అమరవరం ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ లింగగిరి కాంప్లెక్స్ హెచ్‌ఎం పెనుగొండ శ్రీనివాస్, హెచ్‌ఎంలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు హనుమంతరావు, శ్రీనివాస్, విజయకుమారి, పురుషోత్తం, సోమశేఖర్, సైదాబీ పాల్గొన్నారు.



బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ

చింతబండ ప్రభుత్వ పాఠశాలలో..

నేరేడుచర్ల : చింతబండ ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని గురువారం ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జ్యోతి, ఉపాధ్యాయులు ప్రసాద్, జ్యోత్స్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతనపట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మొదలుపెట్టారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ కమనీయంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీ, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అమిత్‌షా సభను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : సూర్యాపేటలో శుక్రవారం నిర్వహించనున్న అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి కోరారు. గురువారం నేరేడుచర్లలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ దోపిడీ పాలనను అంతమొందించే శక్తి బీజేపీకే ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంటూ మాటలకే పరిమితమైందని, చేసిందేమీ లేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభను జయప్రదం చేయాలి

మోతె : సూర్యాపేటలో శుక్రవారం జరిగే బీజేపీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ మండల నాయకుడు వెగ్గిలం పూర్ణాచారి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. బూత్ లెవల్ నాయకులు గుడిపల్లి ఉపేందర్, బీజేవైఎం నాయకుడు బొడ్డు శ్రీధర్, సంతోష్, అరవింద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి